
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 10 జూలై 2025 | 5





సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం పరిధిలోని ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాల లోగో వద్ద ఉపాధ్యాయులు



కపిలేశ్వరపురం మండలం అంగరలో మెగా పీటీఎం 2.0 నిర్వహణకు ఏర్పాట్లు

నేడే మెగా బడి పండుగ

- జిల్లావ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్స్ మీట్
- 2150 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహణ
- జూనియర్ కళాశాలల్లోనూ సమావేశాలు
- మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే ఏకైక లక్ష్యంతో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 'మెగా పేరెంట్స్-టీచర్స్' సమావేశాలు నిర్వహించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ సమావేశాల నిర్వహణకు పరిశీలకులను సైతం నియమించారు. పీటీఎం 2.0కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈమెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనిలోభాగంగా జిల్లాలో వందకు పైగా ఉన్న జూనియర్ కళాశాలలు, 1595 ప్రభుత్వ పాఠశాలలు, 555ప్రైవేటు పాఠశాలల్లో ఈ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లకు సంబంధించి పలుసార్లు సమీక్షలు నిర్వహించారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కార్యక్రమాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కచ్చితంగా హాజరై విజయవంతంచేయాల్సిందిగా ఆదేశించారు. మెగా పేరెంట్స్-టీచర్స్ నిర్వహణ ద్వారా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడంలో భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం ఆదేశించింది. విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగు పరచడంతోపాటు విద్యార్థుల అభ్యసన పురోగతిని చర్చించడానికి ఈ తరహా సమావేశాలు ఉపయోగపడతాయని, ముఖ్యంగా విద్యార్థుల సామర్థ్యాల అంచనా, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారుబాట వేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి కార్యక్రమం నిర్వహణ చేపట్టాలి. మీటింగ్ ప్రారంభ సమయం, చర్చా సమయాలు, విరామం, ముగింపు సమయాలపై సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి పురోగతి, బలాలు, బలహీనతలు, మెరుగుదల అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య వ్యక్తిగత చర్చలకు ఈ సమావేశం వేదిక కావాలి. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సమావేశాల నిర్వహణ చేపట్టాలి. అమ్మ పేరుతో మొక్కలు నాటాలి. ఆటల పోటీలు నిర్వహించారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది. గురువారం ఉదయం 9 గంటలకు జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభమవుతాయి. తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులను పాఠశాలలకు ఆహ్వానిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఫొటోబూత్‌వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫొటోలు దిగుతారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి క్లాస్ టీచర్‌తో కలిసి సమావేశమై చర్చిస్తారు. తల్లికి వందనం పథకం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంట్ మీటింగ్, మనబడి తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారు. 11గంటలకు విద్యార్థులతోవారి తల్లులకు పుష్పాలు సమర్పించి పాదాలకు నమస్కరిస్తారు. అనంతరం తల్లి పేరిట విద్యార్థులు మొక్కలు నాటుతారు. డ్రగ్స్ సైబర్ అవేర్‌నెస్ కార్యకలాపాలపై చర్చిస్తారు. సమావేశాలకు హాజరైన అందరూ విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి సహపంక్తి భోజనాల్లో పాల్గొనేలా జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోను ఈ తరహా ఏర్పాట్లు జరిగాయి.



ధాన్యలక్ష్మి.. వచ్చేసింది!

అన్నదాతలకు తీపి కబురు

- ధాన్యం బకాయిలన్నీ విడుదల
- మొత్తం రూ.362 కోట్లుపైనే
- 24 గంటల్లో చెల్లించేలా నిర్ణయం
- నేడు,రేపు జమకానున్న డబ్బులు
- కోనసీమకు రూ.189 కోట్లు
- తూర్పునకు రూ. 93.74 కోట్లు
- కాకినాడకు రూ.80 కోట్లు
- బాకీల విడుదలతో హర్షం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దాదాపు రెండు నెలలుగా పేరుకుపోయిన ధాన్యం బాకీ లకు మోక్షం కల్పించింది.ఈ మేరకు 24 గంట ల్లోగా వీటిని చెల్లించాలని బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేరుకు పోయిన రూ.362.72 కోట్ల బాకీలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఆసన్నమైన తరుణంలో బాకీలు పంట పెట్టుబడికి ఉపయోగపడనున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.362.74 కోట్లు చెల్లింపు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం బాకీలు పేరుకుపోవడంతో అన్నదాతలు కొన్ని రోజులుగా డబ్బులకు ఎదురుచూస్తున్నారు.మిగిలిన బాకీలు చెల్లిస్తే ఖరీఫ్ సాగుకు డబ్బులు పనికొస్తాయని ఆశించారు. ఈ బాకీలకు సంబంధించి పౌరసరఫరాల సంస్థకు కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమైంది. దీంతో రైతులు పలు చోట్ల ఆందోళనలు చేసిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. అన్నదాతలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్ర బాబు పౌర సరఫరాల సంస్థతో ఇటీవల సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.800 కోట్ల వరకు బాకీలు ఉన్నాయని అధికారులు వివరించారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ధాన్యం బకాయిలపై చర్చ జరిగింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలకు తక్షణం రూ.672 కోట్లు తక్షణం చెల్లింపులు చేయాలని సీఎం ఆదేశించారు.గురు, శుక్రవారాల్లో రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రూ.93.74 కోట్లు, కాకినాడ జిల్లాలో రూ.80 కోట్లు,కోనసీమ జిల్లా లో రూ.189 కోట్ల వరకు బాకీల చెల్లింపులు జరగనున్నాయి.మొత్తం 362.74 కోట్లు చెల్లిస్తారు.తద్వారా రైతులకు ధాన్యం బాకీల బెంగ తీరనుంది. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇప్పటికే రూ.1327 కోట్లు చెల్లింపు

ఈ ఏడాది రబీ సీజన్‌లో ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసింది. ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల నుంచి ధాన్యం సేకరించింది. ఈ మేరకు అన్నదాతలకు ఇప్పటి వరకు రూ.1,327 కోట్లు చెల్లింపులు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు నరకం చూసేవారు.కానీ ప్రభుత్వం మారాక రబీ సీజ న్‌లో రైతులు పండించిన ధాన్యం దాదాపు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. తేమ శాతం దగ్గర నుంచి కొనుగోలు వరకు ఎక్కడా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవహరించింది. మే నెల వరకు సుమారుగా 7.05 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసింది. కాకినాడ జిల్లాలో 15,667 మంది అన్నదాతల నుంచి 1.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు రూ.322 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటిలో ఇప్పటికే 1,167 మంది రైతులకు రూ.242 కోట్లు జమ చేసే సింది. తూర్పుగోదావరి జిల్లాలో 30,481 మంది అన్నదాతల నుంచి 3.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. దీని విలువ రూ.814 కోట్లు.ఇప్పటి వరకు రైతులకు రూ.721 కోట్లు చెల్లించేసింది.ఇంకా రూ.93.94 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. కోనసీమ జిల్లా 22 మండలాల్లో 340 కొనుగోలు కేంద్రాల ద్వారా 33,507 మంది రైతుల ద్వారా రూ.603 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రూ.364 కోట్ల వరకు చెల్లింపులు చేసింది.



24 గంటల్లో సొమ్ము జమ
మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 30,988 మంది రైతుల ఖాతాల్లోకి 24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ అవుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం రైతాంగానికి తీపి కబురు అందించిందన్నారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించారన్నారు.ధాన్యం పాత బకాయిలు వెయ్యి కోట్లకు రూ.672 కోట్ల విడుదలకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు.



పామాయిల్.. వెల..విల!

- ఒక్కసారిగా పడిపోయిన ధర
- పామాయిల్ రైతుల ఆందోళన
- తగ్గిన దిగుమతి సుంకం
- కానరాని కనీస మద్దతు ధర
- ఆదుకోవాలని వేడుకోలు

ఆత్రేయపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్‌పామ్ రైతుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారు. వరిలో అంతరపంటగా వేసుకుని ప్రభుత్వ రాయితీలు పొందిన కొందరు రైతులు పామాయిల్ సాగు చేపడుతున్నారు. గతేడాది దిగుబడితో పాటు మద్దతు ధర లభించడంతో జిల్లాలో రైతులు ఈ సాగు చేపడుతున్నారు. ఆ దిశగా ఉద్యానశాఖ ఈ సాగు చేపట్టాలంటూ ప్రోత్సాహాన్ని అందిస్తోంది. మన రాష్ట్రంలో 1,96,801 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపడుతున్నారు. 39.36 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేస్తూ దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 76,014 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేపడుతున్నారు. ప్రస్తుత కోనసీమ జిల్లాలో 1110 ఎకరాల్లో ఈ సాగు ఉంది. ప్రస్తుత తరుణంలో ఆయిల్‌పామ్ గెల ధర పతనం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతంనుంచి 16.5శాతానికి తగ్గించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న చర్యలతో ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. గతేడాది టన్ను పామాయిల్‌గెల ధర రూ.20 వేల నుంచి రూ.21 వేల వరకు పలికింది. దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో టన్ను రూ.18,650కు పడిపోయింది. ఇది మరింత తగ్గవచ్చని రైతులు కలవరపడుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

కేంద్రం మద్దతు ధర ప్రకటించాలి



కేంద్రం పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గించింది. రెండు నెలలనుంచి ధరలేకపోవడంతో అప్పుల పాలయ్యాం. టన్ను రూ.21 వేల నుంచి రూ.18,650కి పడిపోయింది. వ్యయప్రయాసలతో సాగు చేపడుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర రూ.21 వేలు ఉండేలా చర్యలు చేపట్టాలి.

-కరుటూరి వరప్రసాద్, రైతు, అంకంపాలెం

టన్ను రూ.18,650 ఉంది..



ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.18,650 ఉంది. కోనసీమలో రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. అయితే ప్రస్తుతం ధర తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడూ ధర ఒకేలా ఉండదు.. ఏ పం టకైనా తగ్గడం పెరగడం సర్వసాధారణం.. అయితే ఒకేసారి రూ.2 వేలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

-జి.కోటేశ్వరరావు, ఉద్యానశాఖాధికారి



అధికారులు సమన్వయంతో కేసులు పరిష్కరించాలి

- పోలీసులకు ఎస్పీ సూచన

అమలాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రధాన సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుని కేసులను పరిష్కరించాలని ఎస్పీ డి.కృష్ణారావు సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి ఎలా కృషి చేయాలో వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అర్ధ సంవత్సర క్రైమ్ సమావేశం ఎస్పీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత పోలీసు యంత్రాంగం నేర పరిశోధన, ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలు, బాధితులకు సత్వర న్యాయం వంటి ప్రధాన విషయాలపై సమీక్ష నిర్వహించారు. సరిహద్దు తగాదాల సమయంలో రెవెన్యూ అధికారులతోను, రోడ్డు ప్రమాదాల నివారణలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారులతోను, బాలికలు, మహిళల భద్రత విషయాలపై సోషల్ వెల్ఫేర్ అధికారులతోను చర్చించి భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధివిధానాలపై చర్చించారు. పోలీసులు కేసుల విషయాల్లో కోర్టుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నేర పరిశోధనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కేసుల సత్వర పరిష్కారంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవో డి.శ్రీనివాసరావు, అగ్నిమాపకాధికారి ఎన్.పార్థసారధి, డీఈవో షేక్ సలీంబాషా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా హైవే అథారిటీ ఏఈ ఎన్.వెంకటరమణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు పీపీ ఎంవీఎస్ ప్రకాశరావు, కె.రాధాకృష్ణతోపాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు భూసేకరణ చేయాలి : కలెక్టర్

అమలాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టిసారించి భూసేకరణ వేగవంతం చేసి ఆయా ప్రాజెక్టులు ముందుకు సాగేలా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి భూసేకరణ విభాగానికి సంబంధించిన అధికారులతో చర్చించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్, 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు అంశాల పురోగతిపై సమీక్షించారు. ఎలైన్‌మెంట్ మ్యాపుల రూపకల్పన, భూముల నష్టపరిహారాల చెల్లింపు, నిధులు మంజూరు వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జేసీ నిషాంతి, ఆర్డీవో మాధవి, భూసేకరణ అధికారి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ముందుకొచ్చిన ఎన్నారై..

మాతృభూమికి సేచేయాలనే లక్ష్యంతో సాఫ్ట్‌వేర్ డెవలెప్‌మెంట్ ఐటీ సర్వీస్ శిక్షణ అకాడమీ ఏర్పాటు చేసి మూడేళ్ల కాల వ్యవధిలో వెయ్యిమందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్న యూఎస్‌ఏ సీఐవో చిక్కాల విద్యాసాగర్(ఎన్నారై)ను కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రశంసించారు. కలెక్టరేట్‌లో చిక్కాల విద్యాసాగర్, జేసీ నిషాంతి, పరిశ్రమలశాఖ సహాయ సంచాలకుడు శివరామ్‌ప్రసాద్‌లతో బుధవారం సమావేశమై సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ ఐటీ సర్వీసెస్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు అంశాలపై చర్చించారు. అకాడమీ ఏర్పాటుకు సీఈవో చిక్కాల విద్యాసాగర్ రూ.35కోట్ల అంచనా వ్యయంతో వెయ్యిమందికి సాఫ్ట్‌వేర్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఇంటర్న్‌షిప్ శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనకు మూడేళ్లకాల వ్యవధిలో కృషి చేస్తామని తెలిపారన్నారు. మాతృభూమికి సేవ చేయాలనే సంకల్పంతో ఆయన ముందుకు వచ్చారని, మనకోసం మనం పేరిట ముందుకు రావడం సంతోషకరమని కలెక్టర్ అన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ శిక్షణ అకాడమీ ఏర్పాటుకు జిల్లాలో ఐదెకరాల విస్తీర్ణం గల భూములు సేకరించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. స్థల సేకరణకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటామని విద్యాసాగర్ హామీఇచ్చారు. ఏపీఎల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఎండీ చిక్కాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డీఈవో

అమలాపురంరూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎంలో భాగంగా డీఈవో షేక్ సలీం బాషా సాకుర్రుగరువులోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. మెగా పీటీఎంకు జరుగుతున్న ఏర్పాట్లను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 1వతరగతి నుంచి హిందీ బోధించాలని, సాయంత్రం 3గంటల తర్వాత వ్యాయామంలోభాగంగా ఆటలు ఆడించాలని సూచించారు. హెచ్ఎం అప్పారి ముత్యాలరావు, ఉపాధ్యాయులు కిశోర్‌కుమార్, దుర్గారావు, బాలబసవేశ్వరరావు పాల్గొన్నారు.


సాకుర్రు ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో డీఈవో

అంతర్వేది ఫిషింగ్ హార్బరులో..
పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

- హార్బర్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష
- మౌలిక వసతుల కల్పనపై చర్చ
- మత్స్యకారుల జీవనోపాధి కోసం హార్బరును పూర్తి చేయండి : రాజోలు ఎమ్మెల్యే దేవ

అమలాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది ఫిషింగ్ హార్బరులో పెండింగ్ పనులు పూర్తిచేస్తామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బరు కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, పలువురు కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరు పూర్తిస్థాయి నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. రూ.30కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మినీహార్బరు ప్రాజెక్టు ఇప్పటివరకు రూ.23కోట్లతో పనులు నిర్వహించి గత రెండేళ్ల క్రితం అప్పగించామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. మిగిలిన రూ.7కోట్లకు సంబంధించి విద్యుత్ సరఫరా, తాగునీరు, అప్రోచ్ రోడ్డు, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాల్సిందిగా సూచించారు. పూర్తిస్థాయిలో హార్బరు నిర్మాణం పూర్తయితే 200 పడవల రాకపోకలు సాగించి అధిక చేపల ఉత్పత్తి ఎగుమతి, దిగుమతి లావాదేవీలు జరిగి మత్స్యకారుల జీవన ఉపాధి మెరుగుపడుతుందన్నారు. 1.75 కిలోమీటర్ల రహదారి హార్బరుకు వెళ్తుందని, ఇది మొక్కలతో నిండి ఉండడంవల్ల రూ.20లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులు సూచించారు. రూ.30లక్షలతో తాగునీటి సౌకర్యాలు, రూ.20లక్షలతో విద్యుత్ సదుపాయం కల్పనకు ప్రతిపాదనలు రూపొందించారని సభ్యులు తెలిపారు. ఐస్ ఫ్యాక్టరీని స్థానికంగా ఏర్పాటుచేయాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మినీ హార్బరుకు పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వసతుల కల్పన కోసం ప్రణాళికలు రూపొందిస్తామని, మెకనైజ్డ్ మోటారు పడవలు బెర్తింగ్ చార్జీలు వచ్చే ఆదాయాన్ని బేరీజు వేస్తూ ఉపాధి హామీ అనుసంధానంతో అప్రోచ్ అభివృద్ధి చేస్తామని, ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా తాగునీరు, విద్యుత్‌శాఖ ద్వారా విద్యుత్, మత్స్యశాఖ ద్వారా ఆయిల్ కంపెనీ సమన్వయంతో పెట్రోల్‌బంకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీఎం మత్స్య సంపద యోజన ద్వారా ఐస్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, జిల్లాలో 62 ట్రాన్స్‌పాండర్స్ మెకనైజ్డ్ బోట్లకు కమ్యూనికేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తదుపరి సమావేశం ఈనెల 23 నిర్వహిస్తామన్నారు. జేసీ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, మత్స్యశాఖ ఏడీ వర్ధన్, అంతర్వేదిపాలెం సర్పంచ్ శ్రీనివాస్, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరాజు పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మహేష్, ఎమ్మెల్యే దేవ, కమిటీ సభ్యులు

కార్మిక సంఘాల నిరసన ర్యాలీ

అమలాపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం అమలాపురం బస్టాండు సెంటర్ నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఐవీ, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొవ్వుల సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను దోచుకునేలా ఉన్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేలా కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీవీ సుబ్బారావు, ఆర్టీసీ యూనియన్ నాయకుడు ప్రసాద్ సమ్మెకు మద్దతు తెలిపారు. ర్యాలీలో నాయకులు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్, మోకా శ్రీనివాస్, నిమ్మకాయల శ్రీనివాస్, ఎం.భాస్కరరావు, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, జి.దైవకృప, పార్వతి, బి.ఈశ్వరి, లోవలక్ష్మి,టి.నాగవరలక్ష్మి, కె.శంకర్,పి.శివతో పాటుప్రజాసంఘాలు,విశ్రాంత ఉపాధ్యాయ సంఘం, అంగన్వాడీ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, హమాలీ కార్మికులు, ఆటోవర్కర్స్, ఆర్టీసీ, మెడికల్ రిప్స్, బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అమలాపురంలో కార్మిక సంఘాల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఐవీ



పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి

స్వయంభూగా వెలసిన దత్తాత్రేయుడు కొలువై ఉన్న క్షేత్రం, శ్రీపాద శ్రీవల్లభుల జన్మస్థానమైన మహా సంస్థానం, పలు దత్తపీఠాలకు నెలవుగా ఉన్న పిఠాపురం గురు పౌర్ణమికి సిద్ధమైంది. పట్టణంలోని దత్త క్షేత్రాలు, సాయి బాబా ఆలయాల్లో ఈ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీల సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దత్త క్షేత్రాల్లో వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసాల నుంచి భక్తులు అధికంగా తరలి వస్తున్నారు. ఇప్పటికే ఆయా ఆలయాల వసతి సముదాయాలు, ప్రైవేటు వసతి గృహాలు, లాడ్జీలు మహారాష్ట్ర, కర్ణాటక భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

గురు పౌర్ణమికి ముస్తాబు



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతి

పిఠాపురం జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. దత్తాత్రేయ స్వామికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకి, ఊయల సేవలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి దత్తగురువు వాడ్రేవు శ్రీనివాసరావు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీపాద శ్రీవల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన పట్టణంలోని శ్రీపాదవల్లభ సంస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకాలు, గురు పూజ. సర్వపుష్పపూజ, పల్లకి సేవ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు ఇప్పటికే పిఠాపురం చేరుకున్నారు. ఈ ఏడాది గురుపౌర్ణమి గురువారం రావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది,

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల గోపాల్ బాబా ఆశ్రమం, సినిమా సెంటర్లోని షిర్డీ సాయినాథ్ మందిరంలో, మెయిన్‌రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి. పట్టణ శివారులోని విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురుపౌర్ణమి సభ జరగనుంది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు. పట్టణంలోని సాయిబాబా, దత్త ఆలయాలు అన్నింటినీ ఇప్పటికే ముస్తాబు చేశారు.

నేటి నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవం

పిఠాపురంలో చేపట్టనున్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద స్వామీజీ

సెప్టెంబరు 9 వరకు అనఘా దత్త క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు... అష్టమ కోటి దత్త యాగం నిర్వహణ



పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంలో అత్యంత పవిత్రంగా భావించే చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవానికి పిఠాపురం వేదిక కానుంది. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ పట్టణంలోని అగ్రహారంలో కొలువై ఉన్న అనఘా దత్త క్షేత్రంలో గురువారం దీక్ష చేపట్టి సెప్టెంబరు 7వ తేదీ వరకు కొనసాగించనున్నారు. ఇందునిమిత్తం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దత్త విజయానంద స్వామి చాతుర్మాస్య దీక్ష చేపట్టిన అనంతరం గురుపౌర్ణమి పూజలు, చైతన్యార్చన, పవమాన హోమం, దత్త హోమం, గురు గీతా పారాయణ జరుగుతాయి. నవకోటి దత్తయాగ మహా సంకల్పంలో భాగంగా ఈ నెల 10 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అష్టమకోటి దత్త యాగం జరుగుతుంది. దీనికి అంకుర్పారణ చేస్తారు. 11వ తేదీ రాత్రి 7 గంటలకు చాతుర్మాస్య ప్రవచనం ప్రారంభిస్తారు. ఈ నెల 11 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు యజుర్వేద పారాయణ, ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు శత చండీయాగం, ఈ నెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాస ప్రయుక్త కుంకుమార్చన, ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు సంపూర్ణ కృష్ణయజుర్వేదీయ మూల పారాయణం, 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, హయగ్రీవ జయంతి, శ్రీనివాస కల్యాణం, 16న వెయ్యి మంది దంపతులతో అనఘాష్టమి వ్రతం, శ్రీకృష్ణాష్టమి గోపూజ, 23, 24 తేదీల్లో ప్రాజాప్రత్యేష్టి, సారస్వతేష్టి యాగం, 24న అనఘాలక్ష్మీ సమేత దత్త సత్యనారాయణస్వామికి దివ్య కల్యాణం, 28న దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీరాక, సెప్టెంబరు 7న చాతుర్మాస్య వ్రత పరిసమాప్తి, పవనమాన హోమం జరుగుతాయి.

అనఘా దత్త క్షేతంలో జరిగే పల్లకీ సేవ, రథోత్సవం, మంటపోత్సవం, తెప్పోత్సవం, డోలోత్సవంలో భక్తులు స్వయంగా పాల్గొనే అవకాశం కల్పించారు. దీక్షా మహోత్సవాలు జరిగే సమయంలో ప్రతి ఆదివారం ఉచిత ఆయుర్వేద, అల్లోపతి వైద్య సేవలు అందించనున్నారు. చాతుర్మాస్య దీక్షా మహోత్సవానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాపంగా ఉన్న భక్తులు, గణపతి సచ్చిదానంద స్వామి శిష్యులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో
తొలి షిర్డీసాయి ఆలయం

ఆలమూరులో గురు పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు



ఆలమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే తొలి షిర్డీసాయి ఆలయంగా ఖ్యాతిగాంచింది ఆలమూరులోని షిర్డిసాయిబాబా ఆలయం. జొన్నాడ-రావులపాలెం వారధి నిర్మాణ కాంట్రాక్టరు చెలంకూరి సుబ్బారావు 1956లో ఈ ఆలయాన్ని నిర్మించారు. షిర్డీలో ఉన్న బాబా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి లాల్లిమ్ ఇక్కడ పాలరాతితో విగ్రహాన్ని చెక్కడం విశేషం. అప్పట్లో అంతగా ఆదరణ లేక పోయినప్పటికీ తర్వాత రోజుల్లో భక్తుల తాకిడి అధికమైంది. స్వయంగా బాబానే ఇక్కడికి వచ్చారనే భావన ఇక్కడి షిర్డీసాయిని దర్శించుకున్న భక్తులకు కలుగుతుంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం మండపేటలో రవాణా శాఖ అధికారిగా పని చేసిన కె.సాయోజీరావు ఇక్కడ ఆలయాన్ని దర్శించి స్థానికులతో అభివృద్ధిపై చర్చించారు. ఆలయం ముందు వున్న షాపులను తొలగించి ఆలయం రోడ్డుపైకి కనిపించేలా చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. కమిటీ ఏర్పాటు చేసి నిత్యం పూజలు జరిగేలా చేయడంతో సాయి భక్తులు పెరిగారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ చల్లా ప్రభాకరరావు తెలిపారు. బాబాకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ స్కూలులో ఎంపీటీఎం ఆకృతిలో ఒదిగిన విద్యార్థులు

పీటీఎంకు వేళాయె...

పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని స్కూళ్ళలో ఉపాధ్యాయులు, విద్యార్థులు విభిన్నంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటిని మీరూ చూడండి.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కాగితపు పూలతో మెగా పీటీఎం స్వాగత ద్వారాన్ని తయారు చేస్తున్న విద్యార్థినులు





తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ హైస్కూల్లో స్వాగత బ్యానర్ (పైన) ఫొటో షూట్ కోసం ఏర్పాట్లు (కింద)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట కాంతిభారతి స్కూల్లో...

యువతకు కువైట్‌లో ఉపాధి అవకాశాలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ సంయుక్తంగా తురియా అనే అంతర్జాతీయ సంస్థతో కలిసి కువైట్‌లో నిర్మాణ రంగంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన 24 నుంచి 50 ఏళ్ల మధ్య గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ పనులు ఉంటాయన్నారు. దీనికి ఐటీఐ లేదా డిప్లొమా కలిగి ఉండాలని, అలాగే మూడు నుంచి ఐదేళ్ల అనుభవం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సుమారు రూ. 56 వేల నుంచి 70 వేలు వరకు ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 99888 53335 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాస ఏర్పాట్లు కంపెనీయే అందిస్తుందన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను హెటిటిపిఎస్://నైపుణ్యం.ఏపి.జీవోవి.ఇన్‌లో చూడవచ్చన్నారు. లేదా ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సత్యదేవ నర్సరీని సందర్శించిన కేంద్ర మాజీ మంత్రి



శ్రీరామ్ సాహెబ్ దాన్వేకు మొక్క అందిస్తున్న దృశ్యం

కడియం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కడియపులంక సత్యదేవ నర్సరీని బుధవారం కేంద్ర రైల్వే మాజీమంత్రి, సీనియర్ బీజేపీ నేత శ్రీరామ్ సాహెబ్ దాన్వే సందర్శించారు. ఆయన్ని నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి శ్రీరామ్ సాహెబ్ దాన్వేకు స్వాగతం పలికారు. ఆయన కుటుంబసభ్యులతో విచ్చేసి పలురకాల మొక్కలను చూశారు. వాటి విశిష్టతలు అడిగి తెలుసుకున్నారు. కొన్నిరకాల మొక్కలను కొనుగోలు చేసి తీసుకెళ్ళారు. 2021 నుంచి 2024 వరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రిగా ఉన్నానని చెప్పారు. కుమార్తె సంజన శివసేన పార్టీలో 2024లో ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. కార్యక్రమంలో బాబా గ్రూప్స్ చైర్మన్ ప్రవీణ్‌చంద్, పుల్లా నాగేంద్ర, మాగాపు సూర్య, మెర్ల కృష్ణమూర్తి, గట్టి రమేష్, ఎన్. ప్రేమసాగర్, టీ. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజయ శంకర
సంగీత పాఠశాలలో ప్రవేశాలు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ శంకర సంగీత నృత్య పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి కర్ణాటక సంగీతం, గాత్రం, వాయిద్యం, నాట్యం, మృదంగం, డోలు, శాస్త్రీయ నృత్య విభాగాలలో నాలుగు సంవత్సరాల డిప్లొమా కోర్సులు , రెండు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆసక్తికలిగిన విద్యార్థుల ఎంపికకు కర్ణాటక సంగీతం, డ్యాన్స్, నాట్యం, తదితర విభాగాలలో ప్రతిభా ప్రదర్శన ఆధారంగా ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులు జూలై 1 నాటికి 10 సంవత్సరాలు, డిప్లమా కోర్సులో చేరే విద్యార్థులు జూలై1 నాటికి 15 సంవత్సరాలు నిండి ఉండాలని, సర్టిఫికెట్, డిప్లమా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ దరఖాస్తులను ఈనెల 31 లోగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఫీజు వివరాలు, తదితర పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 0883 - 2421669కు కార్యాలయ పని వేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్ర 5 గంటల్లోగా సంప్రదించాలని సూచించారు.

● సంగీత పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసశర్మ



విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పసుమర్తి శ్రీనివాస శర్మ బాధ్యతలు స్వీకరించినట్టు పాఠశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మండపాక నాగలక్ష్మి పదోన్నతిపై విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు బదిలీ అయ్యారు.

కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్‌కు అవార్డుల పంట

● సంస్థ అధ్యక్షుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ప్రదానం



విజయవాడలో పురస్కారం అందుకుంటున్న వైడీ రామారావు

కార్పొరేషన్(కాకినాడ), జూలై9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉత్తమ రెడ్‌క్రాస్ జిల్లా శాఖగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ రెడ్‌క్రాస్ మరోసారి సత్తా చాటింది. బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం పురస్కార బహూకరణ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ 2021- 22, 2022-23, 2023-24 సంవత్సరాలకు చెందిన రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందజేశారు. ఆయాసంవత్సరాలకు కాకినాడ జిల్లా శాఖ మొదటి స్థానాన్ని గెలుచుకుంది. దీనిలో భాగంగా 2021-22 సంవత్సర పురస్కారాన్ని జిల్లా చైర్మన్ వైడి రామారావు, 2022-23 సంవత్సర పురస్కారాన్ని వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సుగుణ, 2023-24 సంవత్సర పురస్కారాన్ని కోశాధికారి ఎన్‌వీవీఆర్‌కే ప్రసాద్ బాబు గవర్నర్ చేతు లమీదుగా అందుకున్నారు. రెడ్‌క్రాస్‌కు అత్యధిక విరాళాలు అందించడంలో సహకరించిన ఓఎన్ జీసీ ఈడీ అనుపమ్ సక్సేనా, ప్రతినిధి షాదాబ్ అన్వర్, కాకినాడ సీ పోర్ట్స్ ప్రతినిధులు మొహ్మద్ ఖాసీం, మొహద్‌కరీమ్, సాయిరామ ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత ఎల్. సత్యనారాయణ, ఫిలిం డైరెక్టర్ బి.సుకుమార్ తరఫున బి.అశోక్, హౌసింగ్ పీడీ ఎన్‌వీ వీ సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి కె.శివకుమార్, కార్యవర్గ సభ్యులు ఎస్‌వీఎం చంద్రశేఖర్ పురస్కారాలు అందుకున్నారు. 2017-18లో అత్యుత్తమ జిల్లా శాఖలకు పురస్కారం ప్రారంభించినప్పటి నుంచి వరుసగా కాకినాడ జిల్లా శాఖ రాష్ట్రంలో అగ్రగామిగా మొత్తం ఏడుసార్లు పురస్కారం పొందడం గర్వకారణమని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, గవర్నర్ రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, వైడి రామారావు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.

రావి ఆకుపై
సాయినాథుడు



విద్యార్థిని రూపొందించిన చిత్రం

అనపర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమిని పురస్కరించుకుని అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన విద్యార్థిని బద్దిరాజు లక్ష్మీసుప్రజా పార్వతి రావి ఆకుపై సాయి నాథుడి చిత్రాన్ని రూపొందిస్తూ తన భక్తిభావాన్ని చాటుకుంది. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

31 వరకు హజ్ యాత్రకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం సిటీ/ కార్పొరేషన్ (కాకినాడ), జూలై 9 (ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వారు హజ్‌యాత్ర 2026లో యాత్రకు వెళ్లేవారు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం. సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరంలోని ఎస్సీ, బీసీ బాలుర, బాలికల సంక్షేమ వసతిగృహాలను బుధవారం సాయంత్రం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్బన్ తహశీల్దార్ పి. పాపారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, సిటీ ప్లానర్, ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు ఈ తనిఖీలు జరిపారు. ఒక్కొక్క అధికారి మూడు హాస్టళ్ల చొప్పున మొత్తం 18 హాస్టళ్లను తనిఖీ చేసినట్టు తెలిసింది. హాస్టళ్లలో విద్యార్థుల హాజరు, బియ్యం, కోడిగుడ్ల స్టాకు, మౌలిక సదుపాయాలు వంటివన్నీ పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం సక్రమంగా పెడుతున్నారా, కోడిగుడ్డు ఇస్తున్నారా, ఏమైనా సమస్యలున్నాయా వంటి వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల హాజరును గూగుల్‌షీట్ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్టు సమాచారం. వసతిగృహాల్లో తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదికరూపంలో అందజేసే అవకాశం ఉంది. కాగా, రెవెన్యూ, మున్సిపల్ ఉన్నతాధికారులు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో వార్డెన్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హాస్టల్ వార్డెన్లందరికీ బుధవారం సెలవు. సరిగ్గా ఇదే రోజున ఆకస్మిక తనిఖీలు చేపట్టడం గమనార్హం. ప్రధానంగా సంబంధిత ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులను పక్కనబెట్టి తహశీల్దార్ స్థాయి అధికారులను తనిఖీలకు పంపడంతో విద్యార్థుల హాజరులో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

పవన్‌ను విమర్శించే స్థాయి జక్కంపూడికి లేదు

● పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫైర్



పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు లేదని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫైర్‌అయ్యారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అకృత్యాలు ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. రియల్‌ఎస్టేట్ వారిని ఇబ్బంది పెట్టి డబ్బులు దండుకున్న మీకు మా అధినేతను విమర్శిస్తారా అని దుయ్యబట్టారు. రాజా తన తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి రాగా, పవన్ మాత్రం గొప్ప దేశభక్తి భావజాలం, స్వశక్తితో వచ్చారన్నారు. సినిమాలు, రాజకీయాల్లోనే కాదు నిజ జీవితంలోనూ మా అధినేత హీరోనే అన్నారు. ఇకనైనా ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. మహిళల ఆత్మ గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని అవమానించేలా ప్రసన్న కుమార్‌రెడ్డి మాట్లాడటంపై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయనే స్వయంగా ఆ వ్యాఖ్యలను సమర్థించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. చిట్టూరి శ్రీనివాస్, సత్తిబాబు రాజు, పెనుమాల లక్ష్మి, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివాసరాజా, గణపతి రాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, పత్తిపాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల
కుటుంబాలకు ఆర్థికసాయం



జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా పోలీసులు రూ. 8 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. గత నెల 26న ఓ కేసుకు సంబంధించి ఆలమూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఎస్ఐ మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ కోదాడ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సేకరించిన మొత్తాన్ని ఎస్పీ బి.కృష్ణారావు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అశోక్ కుటుంబానికి రూ. నాలుగు లక్షలు, జీవన్ కుటుంబానికి రూ. నాలుగు లక్షలు చొప్పున చెక్కులు అందించారు. అలాగే 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు అదనంగా రూ.68వేల చెక్కును ఎస్పీ చేతులమీదుగా అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

రంగులే.. తీరం కొత్త రూపులే..


కాకినాడ జిల్లా ఉప్పాడలో రంగులుగా మారిన సముద్ర తీరం

కొత్తపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం బుధవారం రంగురంగులుగా దర్శనమిచ్చింది. ఇటీవల వర్షాలు కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు వివిధ పాయల ద్వారా సముద్రంలోకి చేరుతోంది. అక్కడి నుంచి నుంచి బురద నీరు నేరుగా సముద్రంలోకి ప్రవేశించడంతో నీలి రంగులో ఉండే సముద్రం సగభాగం బురద, కొంచెం మేర నీలి రంగు, మరి కొంత భాగం తెలుపురంగులో దర్శనమిస్తోంది. రంగులుగా దర్శనమిస్తున్న సముద్రాన్ని పర్యాటకులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు తీసుకుంటున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

22 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.15 లక్షల నగదు స్వాధీనం


రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాజానగరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నామవరంలో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నామవరం గ్రామానికి చెందిన రేలంగి లోవరాజు ఈ నెల 2న కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ జిల్లా తుని మండలం తలుపు అమ్మ లోవ అమ్మ వారి దర్శనానికి బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన లోవరాజు లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు బద్దలు కొట్టి 22 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.75 లక్షల నగదును దొంగలు అపహరించినట్టుగా గుర్తించారు. లోవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహాకిషోర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్‌కు అందిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన నలబా సత్యనారాయణ, రాజవోలు గ్రామానికి చెందిన బెదంపూడి రత్నరాజు, ఇనకోటి పవన్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ వెల్లడించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలతో పాటు రూ. 1.15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులను పట్టుకున్న సీఐ ప్రసన్న వీ రయ్య గౌడ్, సీసీఎస్ సీఐలు శ్రీధర్‌కుమార్, బలసౌరి, ఎస్ఐలు కే.నాగార్జున, సిబ్బంది అ మ్మిరా జు, సత్యనారాయణ, కరీం, సురేష్, మురళీ, ప్ర సాద్, రమణ, శివరామకృష్ణను అభినందించారు.

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక

అమలాపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కోనసీమ జిల్లా అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సీనియర్ పవర్ లిఫ్టర్ బి.అప్పన్న ఎంపికైనట్టు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగస్టు 2 నుంచి 7వ తేదీ వరకు కేరళలోని కోసిఫుడ్‌లో జరిగే మాస్టర్స్, నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్రం నుంచి అప్పన 120 కిలోల విభాగంలో ఎంపికయ్యారు. అప్పన్నను బుధవారం స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో గారపాటిచంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభినందించి సత్కరించారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, మట్టపర్తి వెంకటసముద్రం, గంగుమళ్ల దొరబాబు, యనమదల పల్లంరాజు, నక్కా సుధాకర్‌బాబు, వీరేంద్ర పాల్గొన్నారు.


అప్పన్నను అభినందిస్తున్న జిమ్ సభ్యులు

గొల్లప్రోలులో వైసీపీకి గట్టి షాక్

- డిప్యూటీ సీఎం పవన్ ప్రతిపాదించిన పనులను అడ్డుకున్న వైసీపీ పాలకులు
- గొల్లప్రోలు కౌన్సిల్‌ను పక్కనపెట్టి ఆమోదించిన కాకినాడ జిల్లా కలెక్టర్
- మున్సిపల్ చట్టంలోని విచక్షణాధికారాన్ని వినియోగించుకుంటూ గ్రీన్‌సిగ్నల్
- పనుల నిర్వహణకు తొలగిన అడ్డంకి



గొల్లప్రోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీ వైసీపీ పాలకులకు గట్టి షాక్ తగిలింది. పట్టణాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన నిధులతో పనులు చేపట్టకుండా రెండు నెలలుగా అడ్డంకు లు సృష్టిస్తున్న ఆ పార్టీ ప్రజా ప్రతినిధుల తీరుకి చెక్ పెడుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం తనకు సంక్రమించిన విచక్షణాధికారాలను వినియోగించుకుంటూ పనులకు పరిపాలనామోదం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పనులు చేపట్టేందుకు వీలు ఏర్పడింది. గ్రామాల అభివృద్ధికి పు ష్కలంగా నిధులు సాధించడంతో పాటు పనులు వేగంగా జరుగుతుండడంతో పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని పిఠాపురంలో అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం రూ.3 కోట్లు, గొల్లప్రోలుకు రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆయా పట్టణాల పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులను ప్రతిపాదించారు. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలపడంతో పాటు టెండర్లు పిలిచారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. అయితే గొల్లప్రోలు పట్టణంలో అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది.

తొలి నుంచీ ఆటంకాలే..

కలెక్టర్ సూచనలకు అనుగుణంగా గొల్లప్రోలు పట్టణానికి మంజూరైన రూ.కోటితో వివిధ ప్రాంతాల్లో 27 రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రతిపాదించి మే 29న జరిగిన గొల్లప్రోలు నగర పంచాయతీ సాధారణ, అత్యవసర సమావేశాల్లో కమిషనరు కనకరావు టేబుల్ అజెండాగా తీసుకురాగా వైసీపీ చైర్‌పర్సన్, పాలకవర్గం అభ్యంతరం తెలిపి వాయిదా వేశారు. అయితే టేబుల్ అజెండాను మినిట్స్ బుక్‌లో కూడా నమోదు చేయలేదు. జూన్‌లో వాయిదా వేసిన అంశాన్ని అజెండాకు రానివ్వకుండా చేసేందుకు కమిషనరు పంపిన అజెండాపై చైర్‌పర్సన్ సంతకం చేయలేదు. దీంతో జూన్ నెలలో సమావేశమే నిర్వహించలేకపోయారు. నిధులు మంజూరై మూడు నెలలు గడిచినా పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

'ఆంధ్రజ్యోతి'లో కథనం..

నగర పంచాయతీలో వైసీపీ పాలకవర్గం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన కోటి రూపాయల నిధులతో ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలపకుండా అడ్డంకులు సృష్టిస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 2న కథనం ప్రచురితమైంది. ఇదే విషయాన్ని నగర పంచాయతీ కమిషనరు కనకారావు కలెక్టర్ షాన్ మోహన్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో ఏపీ మున్సిపల్ చట్టం 1965లోని సెక్షన్ 68 కింద విచక్షణాధికారాన్ని వినియోగించుకుంటూ రూ. కోటితో 27 పనులు చేపట్టేందుకు పరిపాలనా ఆమోదం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయానికి చేరాయి. ఇదే విషయంపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. కలెక్టర్ ఆదేశాలపై కౌన్సిల్‌కు సమాచారం ఇచ్చి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

వైసీపీ సమావేశ ఏర్పాట్లలో విద్యుదాఘాతం

ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న సురేష్, రాజు

సామర్లకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు నందు బుధవారం సాయంత్రం పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశపు ఏర్పాట్లలో భాగంగా వైసీపీ నాయకులు ఫ్లెక్సీలను రోడ్డు పక్కన నిలబెడుతుండగా గాలి వాటానికి విద్యుత్ తీగెలను ఫ్లెక్సీ బోర్డు తాకడంతో విద్యుద్ఘాతానికి ఫ్లెక్సీ బోర్డు పట్టుకున్న వైసీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, భాస్కర్‌నగర్‌కు చెందిన కార్యకర్త రంపా రాజు తీవ్రంగా గాయపడ్డారు. ఫంక్షన్ హాలులో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు వారిద్దరికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని మెడికవర్ వైద్యులు చెప్పారు.

డ్వాక్రా సొమ్ము రూ.20లక్షలు స్వాహా

ఇద్దరు యానిమేటర్ల అరెస్టు

అమలాపురం రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు వివిధ రకాల రుణాలను బ్యాంకు నుంచి తీసుకున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా బ్యాంకుకు వాయిదాలు చెల్లించేందుకు డ్వాక్రా యానిమేటర్లను నమ్ముకున్నారు. వారిలో అత్యధికులు కూలి పనులకు వెళ్లేవారు నిరక్షరాశ్యులు కావడంతో వారు చెల్లించిన లక్షలాది రూపాయల నగదును స్వాహాచేసి చేతులెత్తేశారు. నగదు స్వాహా వ్యవహారం ఈ ఏడాది జనవరిలోనే వెలుగు చూసింది. అయితే స్వాహా చేసిన సొమ్ములు తిరిగి చెల్లిస్తామని నమ్మించి మళ్లీ మోసానికి పాల్పడ్డారు. చివరకు డ్వాక్రా మహిళల ఫిర్యాదుతో మోసానికి పాల్పడ్డ యానిమేటర్లు కటకటాల పాలయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి గ్రామంలో డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.20 లక్షలు ఫైబడి నిధులను అదే గ్రామానికి చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీవోఏ)లు స్వాహా చేశారు. నిధులు స్వాహా చేసిన డ్వాక్రా యానిమేటర్లు (వీవోఏ) కొల్లు వెంకటలావణ్య, బొక్కా కనకమహాలక్ష్మిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. గ్రామంలో సుమారు 90 డ్వాక్రా సంఘాల్లోని మహిళలు స్త్రీనిధి రుణాలతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, బ్యాంకు లింకేజీ రుణాలను తీసుకున్నారు. వాటిని క్రమం తప్పకుండా నెలనెలా యానిమేటర్లయిన లావణ్య, కనకమహాలక్ష్మికి బ్యాంకులో జమ చేసేందుకు చెల్లించారు. అయితే చెల్లించిన సొమ్ములు బ్యాంకుకు జమ కావడం లేదని గుర్తించిన డ్వాక్రా మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ శాఖ అధికారుల బృందాలు దఫదఫాలుగా విచారణ జరిపి రూ.20లక్షలు ఫైబడి నిధులు స్వాహా జరిగినట్టు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఆ సొమ్ములు చెల్లిస్తామని చెబుతూనే యానిమేటర్లు కాలం వెళ్లదీశారు. చివరకు డ్వాక్రా మహిళల ఫిర్యాదు మేరకు యానిమేటర్లు లావణ్య, కనకమహాలక్ష్మిని అరెస్టు చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచారు. వారికి రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.

మంచి భర్త.. నాన్నను కాలేకపోయా.. సారీ!

లెటర్ రాసి రిపోర్టర్ ఆత్మహత్య


మెట్ల కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంచి నాన్నను కాలేకపోయాను..మంచి భర్తను కాలేకపో యాను.. మంచి కొడుకును కాలేకపోయాను.. సారీ అంటూ ఒక వ్యక్తి క్షణి కావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన మెట్ల కుమార్ (45) గత దశాబ్ద కాలంగా జర్నలిజంలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రముఖ దిన పత్రికలో గత ఎనిమిదేళ్లుగా క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య గౌరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజమహేంద్రవరం బొమ్మూరు నేతాజీ నగర్‌లోని ఎర్రన్నాయుడు హిందీ కళాశాల సమీపంలో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇంట్లో మనస్పర్థల కార ణంగా గత నెల 23న ఉదయం 11 గంటల సమయంలో బయటకు నడుచుకుంటూ వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం రైల్వే క్వార్టర్స్ రోడ్డులోని ఆలయానికి వచ్చిన వారికి దుర్వాసన రావడంతో 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహం మెట్ల కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా పాడైంది. మెట్ల కుమార్ బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మెట్ల కుమార్ మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తారు. అయితే కుమార్ బిర్యానీలో గడ్డిమందు కలిపి తిని ఆత్మహ్యాకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

జేబులో బుక్..

మృతదేహం సమీపంలో తన జేబులో పెట్టుకునే పాకెట్ బుక్‌ను కవర్‌లో పెట్టి దారంతో కట్టి ఉండడాన్ని గమనించి పోలీసులు ఆ బుక్‌ను ఓపెన్ చేసి చూస్తే అందులో కుమార్ తన కుటుంబీకుల కోసం రాసుకున్న అఖరి అక్షరాలు కనిపించాయి. మంచి భర్తను కాలేకపోయాను ఐ లవ్ యూ గౌరి అని భార్యను, మంచి నాన్న కాలేకపోయాను ఐ లవ్ యూ చిట్టితల్లి అని కుమార్తెను, బాబు జశ్వంత్ అమ్మను చెల్లిని జాగ్రత్తగా చూసుకో అని కుమారుడుని, మంచి కొడుకును కాలేకపోయానని తన తల్లిదండ్రుల ను, మంచి అల్లుడిని కాలేకపోయాను అని మావయ్యను ఉ ద్దేశించి సారీ అని రాసి ఉంది. నా వాటా ఆస్తిని నా పిల్లలకు చెందేలా చేయాలని చివరిగా రాసుకున్నాడు. బుక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థి గొంతు రెడ్డి విజయ్‌కుమార్ (14) అదృశ్యమయ్యాడు. ధర్మవరంలోని సీతంపేటకు చెందిన విజయకుమార్ ఇంటిలో గొడవపడి వెళ్లిపోయినట్టు బుధవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఆచూకీతెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

డాక్టర్ లేరు... అంబులెన్స్ రాలేదు

వైద్యం అందక ఆరేళ్ల బాలుడి మృతి


మరణించిన బాలుడు
బాలుడిని ఎత్తుకుని ఆసుపత్రి ప్రాంగణంలో కుటుంబ సభ్యులు

ఎటపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ వచ్చిన ఆరేళ్ల బాలుడికి వైద్యం అందక, అటు 108 అంబులెన్స్ సమయానికి రాక మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం బండిరేవు గ్రామంలో జరిగింది. బండిరేవుకు చెందిన నూపా జయదేవ్ (6) గత 3 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం బాలుడికి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీకి వైద్యం కోసం తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యాధికారిణి అందుబాటులో లేకపోవడంతో వైద్యాధికారిణి సూచనలతో అక్కడి సిబ్బంది బాలుడికి 2 గంటల పాటు వైద్యం చేశారు. బాలుడిని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించాలని భావించి 108 అంబులెన్స్‌ను సంప్రదించారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చివరకు కూనవరం నుంచి 108 అంబులెన్స్ అందుబాటులోకి లభించింది. దాంతో అక్కడి నుంచి లక్ష్మీపురానికి ఆలస్యంగా రావడంతో బాలుడి ఆరోగ్య పరిస్థితి విష మించి మృతిచెందాడు. లక్ష్మీపురం పీహెచ్ సీ వైద్యాధికారిణి అందు బాటులో లేకపోవ డంతోనే తమ బాలుడి మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారిణి గౌతమిని వివరణగా కోరగా బాలుడు జయదేవ్‌కు గుండె సమస్య ఉందని, ఇతరత్రా చోట్ల వైద్యం అందిస్తున్నారని, బాలుడి ఆరోగ్య పరిస్థితి విషయంగా ఉన్నప్పుడే తీసుకువచ్చారని, చికిత్స అందిస్తునే మెరుగైన వైద్యానికి తరలించే క్రమంలో మృతిచెందాడని పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


సంఘటనా స్థలంలో సుభాష్ మృతదేహం, (ఫైల్)

రావులపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి చిన్నపేటకు చెందిన యడ్ల సుభాష్(24) బుధవారం రావులపాలెం వైపు నుంచి గోపాలపురం జాతీయ రహదారి సెంటర్ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో లారీ చక్రాల కింద నలిగి సుభాష్ అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

దుస్తులు ఆరవేయలేదని భర్త మందలింపు

భార్య ఆత్మహత్య

కొత్తపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడనే మనస్తాపానికి గురైన భార్య ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని మృతిచెందిన్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన మనల్లే నాగరవీంద్ర గత కొంత కాలంగా కోనసీమ జిల్లా రావులపాలెం సర్వే పామాయిల్ కంపెనీలో ఫీల్డ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. తన భార్య పావని(24), రెండేళ్ల కుమార్తెతో కలిసి కొత్తపేట బాబానగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి రవీంద్ర విధులు ముగించుకుని ఇంటికి రాగ తన భార్య పావనిని ఉతికిన దుస్తులు ఆరవేయలేదని మదలించాడు. దీంతో మనస్తాపానికి గురైన పావని పక్క గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుంది. చూట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలుకొట్టి భార్య పావనిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతిచెందిన్నట్టు ధ్రువీకరించారు. పావని తండ్రి కొండేపూడి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.70వేలు చోరీ

నిందితుడి అరెస్టు

యానాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగదును డ్రా చేసేందుకు ఏటీఎంకు వెళ్లిన రిటైర్డు పోలీసు ఉద్యోగిని బోల్తా కొట్టించి కార్డును మార్చి వేసి నగదును డ్రా చేసుకుని పరారైన నిందితుడిని బుధవారం యానాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు... కాకినాడ జిల్లా పిఠాపురం వద్ద నందికిషురానికి చెందిన ప్రస్తుతం కాకినాడ రాయుడుపాలెంలో నివాసం ఉంటున్న కాసీబు రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. గత నెల 28న యానాంలోని పిల్లా రాయవీధిలో గల ఎస్‌బీఐ ఏటీఎం నుంచి పోలీసు రిటైర్డ్ ఉద్యోగి పి.సత్యనారాయణ రూ.10 వేలు డ్రా చేశాడు. మినీస్టేట్మెంట్ కోసం ప్రయత్నించినా రాకపోవడంతో పక్కనే మాస్క్ పెట్టుకుని ఉన్న రాంబాబును తీయమని అడిగి కార్డుతో పాటు పిన్ నెంబరు చెప్పాడు. అయితే స్టేట్మెంట్ రావడంలేదని చెప్పి సత్యనారాయణకు తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డును ఇచ్చాడు రాంబాబు. అది గ్రహించని సత్యనారాయణ ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం బైక్‌పై వెళ్లిన రాంబాబు సుంకరపాలెం వద్ద ఉన్న ఏటీఎంలో సత్యనారాయణ నుంచి తీసుకున్న కార్డు పెట్టి రూ.70వేలు విడతల వారిగా డ్రా చేశాడు. 30న బ్యాంక్‌కు వచ్చిన సత్యనారాయణ పాస్‌బుక్ వివరాలు నమోదు చేయించుకోగా రూ.70వేల మేరకు నగదు డ్రా అయినట్టు గమనించి పోలీసులును ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, క్రైం సిబ్బంది దుర్గారావు, గణేష్, జాంటీలతో కలిసి ఏటీఎం సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి నిందితుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఏటీఎం కార్డు, రూ.1000 నగదు, బైక్ స్వాధీనం చేసుకుని యానాం కోర్డులో హాజరుపరిచారు. నిందితుడు రాంబాబుపై విశాఖపట్నంలోని దువ్వాడ, కాకినాడలోని సర్పవరంలో 7 కేసులు ఉన్నట్టు గుర్తించారు.

ఆర్టీసీ బస్సులు ఢీకొని ఆరుగురికి గాయాలు

ముమ్మిడివరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సమీపంలో జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సమీపంలో ఆవు అడ్డు రావడంతో సడెన్ బ్రేక్ వేయగా వెనుక నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని ఆరుగురు ప్రయాణికులు గాయపడగా కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.

సమ్మె సక్సెస్!

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పలు డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల ధర్నాలు, నిరసనలు చేపట్టారు.


వై.రామవరంలో మానవహారం నిర్వహిస్తున్న వర్కర్లు



రాజమహేంద్రవరంలో సమ్మె నిర్వహిస్తున్న నాయకులు


ప్రత్తిపాడులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు


ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు


మండపేట: సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు


పిఠాపురంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముంగండ తాగునీటి చెరువులో చేపలు పడుతున్న కారణంగా పి.గన్నవరం, లంకలగన్నవరం, పోతవరం, ముంగండ, ముంగండపాలెం, కె.ముం జవరం, వైకొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి గ్రామాలకు శుక్రవారం తాగునీటి సరఫరా జరగదని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణచక్రవర్తి తెలిపారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

సార్వత్రిక సమ్మె విజయవంతం

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను నిర్వీర్యంచేసే లేబర్ కోడ్ చట్టాలను ఉప సంహరించుకోవాలని చేపట్టిన సమ్మె ముమ్మిడివరంలో విజయవంతమైంది. సీఐటీయూ, ఏఐటీయూసీ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లోని బైపాస్ రోడ్డు సెంటర్ వరకు ఎర్ర జెండాలు, ప్లకార్డులు చేత బట్టి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సెక్టార్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడారు

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): సమ్మెకు మద్దతుగా జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు ఆధ్వర్యంలో కాట్రేనికోన డీసీసీబీ వద్ద ఉద్యోగులు ఆందోళన చేశారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ కార్మిక సంఘాల సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేశారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తంలో సహకార సంఘాల సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆకుల సూర్యప్రభాకర్, మంచెం బాబి, పోలిశెట్టి దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, పారిశుధ్యం తదితర కార్మికులు నిరసన తెలిపారు. వినతిపత్రాన్ని తహశీల్దారు చినబాబుకు అందించారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురం సహకార బ్యాంకు పరిధిలో పది సహకార సంఘాల సిబ్బంది కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ సంఘాలను మూసివేసి డీసీసీబీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మలికిపురం సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

అంతర్వేది,(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండల కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, ఆశ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథక సిబ్బంది నిరసన తెలిపారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు డిమాండ్ చేశారు. పి.గన్నవరలో బుధవారం అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ కార్మిక సంఘాల సభ్యులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మామిడికుదురు ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు కూడలి వరకు ఈ ర్యాలీ చేశారు. కనీస వేతనం చెల్లించాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అందరికీ సంక్షేమ ఫలాలు


మలికిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో అద్భుతమైన పథకాలను అమలు చేశామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు సందర్భంగా దిండి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

ఎంపీ, ఎమ్మెల్సీ పరామర్శ

అంతర్వేది, జూలై 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో జనసేన నాయకుడు కామాని దుర్గాప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎంపీ గంటి హరీష్‌మాధు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పరామర్శించి రూ.30 వేలు అందించారు. పిల్లల చదువుకు బాధ్యత వహిస్తామని హామీ ఇచ్చారు. డీటీవో శ్రీనివాసరావు రూ.10వేలు, ఆరు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందించారు.


'సుపరిపాలన' కార్యక్రమం

అల్లవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజలు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బుధవారం గుండెపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.










కేతా శ్రీను కుటుంబ సభ్యులకు పరామర్శ



రాజోలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజోలు ఎంపీపీ కేతా శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం భార్య వెంకటలక్ష్మిని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పరామర్శించారు. వెంకటలక్ష్మికి టీడీపీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. కేతా శ్రీను చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, పిల్లి శ్రీరామమూర్తి, జగడం సత్యనారాయణ, అనుచూరి పురుషోత్తం, చిట్టూరి సంతోష్, అడబాల సత్యరమేష్, పితాని సూరిబాబు, గెడ్డం ప్రసాద్, గుత్తుల శ్రీను, గుబ్బల భూషణం, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, కడలిమోహన్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

ముమ్మిడివరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని వైసీపీ వైపు ఆకర్షించేలా కార్యకర్తలు కృషి చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ముమ్మిడివరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో బుధవారం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన మాట్లాడారు.



పుదుచ్చేరి సీఎం, గవర్నర్ మధ్య విభేదాలు

యానాం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాజకీయంలో కలకలం రేగింది. ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథన్ మధ్య విభేదాలు తలెత్తడంతో రాజకీయంగా తీవ్ర గందరగోళానికి దారితీసింది. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ డైరెక్టర్ నియామకంలో సీఎం సూచించిన పేరు కాకుండా గవర్నర్ మరో పేరును సూచించి ఉత్తర్వులు జారీ చేయడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. తాను సూచించిన పేరును గవర్నర్ ఉత్తర్వులు ఇవ్వకపోతే తాను సీఎంగా ఎందుకని సన్నిహితుల వద్ద వాపోయి రాజీనామా చేస్తానని ప్రకటించినట్లు తెలిసింది దీంతో ఎన్ఆర్ కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశమై స్పీకర్‌ను కలిశారు. పుదుచ్చేరిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితు లపై చర్చించేందుకు తక్షణం అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని స్పీకర్‌కు ఇచ్చినలేఖలో వారు కోరారు. దీంతో స్పీకర్ సీఎంతో చర్చించి అనంతరం స్థానిక మీడియాతో మాట్లాడుతూ జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వానికి రాబోయే ఐదేళ్లు సీఎం రంగసామి నాయకత్వం వహిస్తారని,ప్రస్తుతానికి ప్రభుత్వానికి ఎటువంటి ప్రమాదం లేదన్నారు. గవర్నర్, సీఎం మధ్య విభేదాలు పరిష్కారమవుతాయన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఉప్పలగుప్తం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో-2ను తక్షణమే సవరించి కనీస వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు చెయ్యాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. జీతంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అమలాపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వినతిపత్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందజేశారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

అమలాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏఐబీఈఏ పిలుపుమేరకు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని బ్యాంకుల సిబ్బంది వందలాది మంది ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమలాపురంయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి వద్ద బ్యాంకు సిబ్బంది నిరసన చేపట్టారు. బ్యాంకు నుంచి గడియార స్తంభం వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు.

డిగ్రీ కళాశాలకు రూ.కోటి నిధులు

ముమ్మిడివరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కెనరా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సత్యనారాయణరాజును కలిసి డిగ్రీ కళాశాల పరిస్థితులను వివరించి మౌలిక వసతుల కల్పనకు నిధులు కోరగా ఆయన స్పందించి రూ.కోటి సీఎస్సార్ నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే బుచ్చిబాబు వివరించారు. డిగ్రీ కళాశాలను వారు కెనరా బ్యాంకు రీజనల్ అధికారి గణేష్‌తో కలిసి బుధవారం పరిశీలించారు.







ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆగ్రహం

మండపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): జెడ్.మేడపాడు పంచాయతీలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందన్న స్థానికుల ఫిర్యాదుపై మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శితో పాటు ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం కోసం జెడ్.మేడపాడుకు వచ్చిన ఆయనకు జెడ్.మేడపాడు రైల్వేగేటు సమీపంలో చాలా కాలం నుంచి మంచినీళ్లబావితోపాటు ఖాళీ స్థలం ఉంది. గ్రామస్థులు మంచినీళ్ల బావిని వాడుకునేవారు. ఇటీవల ఆ నూతితో సహ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి తమదేనంటూ స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఫెన్సింగ్‌ను తొలగించటంతోపాటు వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవో సత్యనారాయణను ఆదేశించారు. జెడ్.మేడపాడు సర్పంచ్‌తో సహ పలువురు పెద్దలను ఆ స్థలం వ్యవహారంపై ఆరా తీశారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్థలం కబ్జాకు గురైన వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు వివరణ ఇచ్చారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని లేకుంటే అధికారులను ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు

ఆలమూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాససాహిత్య ప్రాజెక్టు అధికారి పి.ఆనందతీర్థాచార్యులు అన్నారు. బుధవారం ఆలమూరు విచ్చేసిన ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ఆషాఢ మాసంలో తొలిఏకాదశి, గురుపౌర్ణమి వంటి శుభ ఘడియాలు ఉన్నాయన్నారు. భగవంతుడిని కొలవడానికి ముహూర్తం ఉండకూడదని ఏరోజైనా మంచిదేనని ఆయన అన్నారు. మనల్ని సన్మార్గంలో పెట్టే గురువులను పూజించడం వల్ల జీవితంలో ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దాససాహిత్య ప్రాజెక్టులో పురందరదాసు సంకీర్తన మండలి ఏర్పాటు ప్రతినిధి పి.ముకుందేశ్వరస్వామి, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



భక్తులద్దేశించి ప్రసంగిస్తున్న దాససాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.04లక్షలు

ఆత్రేయపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,04,000 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్న ఆలయాభివృద్ధికి అధికారులు సహకరించాలి

ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం వాడపల్లి వెంకన్న ఆలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. శ్రీనివాస ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతంలోని మెరక పనులు, ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఉప కమీషనర్ సూర్యచక్రధరరావు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తహశీల్దార్ రాజేశ్వరావు, ఎంపీడీవో వెంకటరామన్‌తో పాటు పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అన్నదాన భవన నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

రామచంద్రపురం(దాక్షారామ), జూలై 9 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లో ఆస్తిపన్నులు వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ పరిపాలన రీజనల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. బుధవారం రామచంద్రపురం పురపాలక సంఘంలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల విభాగాధిపతులతో వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. రెవెన్యూ, శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ వివిధ అంశాలపై వార్డు సచివాలయాల పనితీరుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ కమిషనరు కెటిఆర్ రాజుతో పాటు ఇతర మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఆర్డీవో

రావులపాలెం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, తహశీల్దారు ముక్తేశ్వరరావుతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో విద్యార్థులను పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు ఉచితంగా విద్యార్థులకు భోజనాలు అందించాలని హెచ్ఎం ఆర్.మధుసూధనరావుకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీకర్

పరిసరాల శుభ్రతతో దోమలవ్యాప్తి నివారణ



దోమల లార్వాను పరిశీలిస్తున్న మలేరియా జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

రాయవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చునని మలేరియా జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాయవరం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించిన అనంతరం గ్రామంలో పలు ప్రాంతాల్లో దోమల లార్వాను ఆయన పరిశీలించారు. గ్రామంలో దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అనంతరం వెదురుపాకలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ పి.దీనదయాల్ బిషప్, వైద్యాధికారులు రమ్యశ్రీ, అనిరుధ్, ల్యాబ్ టెక్నిషియన్ నాగరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో బుధవారం 21 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఇద్దరిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించి మెరుగైన వైద్యం కోసం కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి రిఫరల్ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.అనంతరామకృష్ణ తెలిపారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెచ్‌ఈవో బి.రామారావు, హెచ్‌వీ మేరీమణి, స్టాఫ్ నర్సు బంగారుపాప, ల్యాబ్ టెక్నిషియన్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు పాలకవర్గాల నియామకం

రాయవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి, మాచవరం, చెల్లూరు, కూర్మాపురం సహకార సంఘాలకు పాలకవర్గ సభ్యుల నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాచవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా మేడపాటి రవీంద్రారెడ్డి, పసలపూడి పీఏసీఎస్ ఛైర్మన్‌గా సత్తి వెంకట కృష్ణారెడ్డి(ఎస్‌వీ), చెల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా వెంటూరు గ్రామానికి చెందిన దేవళ్ల వెంకట్రావు, కూర్మాపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా వట్టికూటి సూర్యకుమారి నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈసందర్భంగా త్రిసభ్య కమిటీ ఛైర్మన్లు తమను ఎంపిక చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎల్‌వోలకు శిక్షణ

కె.గంగవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్నికల బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, శిక్షణ పొందిన బీఎల్‌వో దంగేటి నరేష్‌కుమార్, డీటీ ఎం.చంద్రశేఖర్‌లు 35 మంది బీఎల్‌వోలకు ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.



ఆలమూరు మండలం గుమ్మిలేరులో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



మండపేట మండలం కేశవరంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, స్థానిక నేతలు



ఆత్రేయపురం మండలం వాడపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణంరాజు

కూటమి పాలన ఆదరణను ఓర్వలేకపోతున్నారు

• వైసీపీ నాయకుల తీరుపై మండిపడిన ఎమ్మెల్యే బండారు • సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల విస్తృత పర్యటనలు

ఆలమూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనకు వస్తున్న ఆదరణను ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో బుధవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ఏడాది పాలనపై సాధించిన విజయాలను వివరిస్తూ ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, నాయకులు వంక అన్నవరం, ఈదల వీర్రాజు, యాదగని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు. గురువారం వాడపల్లి, మెర్లపాలెం గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి యాప్‌లో నమోదు చేశారు. ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తోట రజని, పార్టీ గ్రామ అధ్యక్షుడు యెరుబండి రాజు, యేపుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కూటమి పాలనపై ఆయన ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. వచ్చేనెలలో మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కేశవరంలో ఆయన ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరించటంతోపాటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే వెంట గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, ఉండమట్ల సురేష్, కంటిపూడి శ్రీను, కూటమి పార్టీనేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

రాయవరం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని వెదురుపాక టీడీపీ సీనియర్ నేత కొవ్వూరి చంటిరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం టీడీపీ నాయకులు గ్రామంలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సత్తి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, కటారి రామకృష్ణ, వడ్డాది చిన్నకృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కూటమికే సాధ్యం

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వాకతిప్పలో రైతులు అభివృద్ధిపరిచిన పాతకాలువ గట్టును ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కూటమి నాయకులతో పర్యటించిన ఎమ్మెల్యే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్ళి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బిసత్తిబాబు, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీలు కుంచె ప్రసన్నకుమార్, సుంకర వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ మోటుపల్లి బాపిరాజు, సుంకర బుజ్జి, కోరుమిల్లి టీడీపీ అధ్యక్షుడు కొండిశెట్టి నాగేశ్వరరావు, యండగండి నీటివినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఆచంట శ్రీనివాస్, వార్డు సభ్యులు, వెలుగుబంటి ఏసుదాసు, వెలుగుబంటి వీరభద్రం, అల్లూరి రామకృష్ణచౌదరి, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, నాగుల చెరువు సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో నేడు గురుపౌర్ణమి

రాయవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో 10న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. బుధవారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ పీఠంలో ఉన్న సాయిబాబా, శ్రీకృష్ణుడు, దత్తాత్రేయుడికి అభిషేకాలు, అమ్మవారికి శ్రీచక్ర అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులతో ఆది శంకరాచార్యులు, భారతీయతీర్థ, అభినవ విద్యాతీర్థ స్వామి పాదుకలకు పూజలు, పీఠాధిపతి గాడ్‌కు పాదపూజలు నిర్వహిస్తామన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించనున్నట్టు బీజేపీ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు చాత్రాతి జానకి రాంబాబు తెలిపారు. పీఠాధిపతి గాడ్‌ను కలిసి సన్మానం నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఆత్రేయపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన ట్రస్టుకు అనకాపల్లికి చెందిన టి.శ్రీనివాససుబ్రహ్మణ్యశాస్త్రి, సునీత దంపతులు రూ.25వేలు, హైదరాబాద్‌కు చెందిన బి.జనార్ధన్, విశ్వనాథశాస్త్రి, శ్రీనివాసులు రూ.10,116 విరాళాలను అందజేశారు. దాతలకు ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందచేత

మండపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు రూ.36 లక్షల విలువైన ఉపకరణాలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు. నియోజకవర్గంలో 196 మందికి మూడు చక్రాల రిక్షాలు, వినికిడి పరికరాలు, 13 రకాల ఉపకరణాలు అందచేశారు. కార్యక్రమంలో ఎన్.వీర్రెడ్డి, ఎంపీపీ వాసు, ఎంపీడీవోలు సత్యనారాయణ, కీర్తి స్పందన, సర్పంచ్‌లు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదురుగా ధర్నా జరిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అడహాక్ కమిటీ ట్రెజరర్ వై.స్వర్ణన్‌రాజు, ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్‌వి మునేశ్వరరావు, కోశాధికారి వై.కామేశ్వరి, నాయకులు వీరయ్యచౌదరి, రామకృష్ణచౌదరి, ఏఐటీయూసీ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, సీసీఐ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

రావులపాలెం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంట్లో వారితో గొడవపడి పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న ఒక యువకుడిని రావులపాలెం పోలీసులు కాపాడారు. గోపాలపురానికి చెందిన లలిత సాయిరమేష్ అనే యువకుడు ఇంట్లో వారితో గొడవపడి పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. ఇది తెలుసుకున్న ఎఎస్‌ఐ చిన్నారావు, క్రైమ్ కానిస్టేబుల్ త్రిమూర్తులు అతని వద్దకు వెళ్లి ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం

మండపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మండపేట అర్బన్, రూరల్‌లో సీఐటీయు, వామపక్ష పార్టీలతోపాటు ఐఎఫ్‌టీయుల ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. మండపేటలో బుధవారం జరిగిన కార్మికుల సమ్మెకు కార్మిక సంఘ నాయకులు నరేంద్ర, ఎం.సూర్యకుమారి, సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి సారధ్యం వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండపేటతోపాటు రూరల్‌లో సమ్మె జరిగింది. ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి చికట్ల వేంకటేశ్వరరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రైస్‌మిల్లు జట్టు, పేపరుమిల్లు, ద్వారపూడి వస్త్ర మార్కెట్ జట్టు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెలో భాగంగా మండపేట కలువపువ్వు సెంటరు నుంచి బస్టాండ్ వరకు కార్మికులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

రాయవరం, (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని రాయవరం తహశీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం కొద్దిసేపు ధర్నా నిర్వహించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.కృష్ణకుమారి, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు కె.తాతారావు, ఎలక్ట్రీషియన్ యూనియన్ నాయకుడు బీరా దుర్గా ప్రసాద్ ఉంగరాల త్రివేణి, సత్యవేణి, కమల, పద్మావతి , వివిధ రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో కార్మికుల ప్రదర్శన

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో రామచంద్రపురంలో కార్మికులు ప్రదర్శన జరిపారు. సీఐటీయు, ఏఐటీయుసీ, ఐఎఫ్‌టీయు 1, ఐఎఫ్‌టీయు 2 ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిపారు. మార్కెట్ సెంటర్ నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు మేడిశెట్టి దుర్గమ్మ, శ్రీదేవి, ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలకా సుభాషిణి, సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పెంకె సత్యనారాయణ, ఏఐటీయుసీ నాయకులు పెద్దిరెడ్డి రాము, కె.సత్యవేణి, గొరిపర్తి రాజు, పిల్లి వెంకట్రావు, లారీ వర్కర్స్ యూనియన్ నాగరాజు, ప్రజానాట్య మండలి నాయకులు ఎం.ప్రేమానందం, ఎస్.శారదాదేవి, బీరు ఫ్యాక్టరీ వర్కర్స్ నాయకులు నాగేశ్వరరావు, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో ప్రదర్శన జరుపుతున్న కార్మికులు

మెగా పేరెంట్స్ సమావేశాలకు సర్వం సిద్ధం

కొత్తపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న మెగా పేరెంట్స్ సమావేశాలకు అన్నీ సిద్ధం చేసినట్టు ఎంఈవో ఎం.హరిప్రసాద్ తెలిపారు. కొత్తపేట మండలానికి సంబంధించి 12 ఉన్నత పాఠశాలలు, 71 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు కలిపి మొత్తంగా 107 ప్రాంగణాలలో మెగా పేరెంట్స్ సమావేశాలు జరిపేందుకు సిద్ధం చేశామన్నారు. కొత్తపేట కాంతి భారతి విద్యా సంస్థలు పేరెంట్స్ సమావేశానికి అన్ని సన్నాహాలు పూర్తిచేసింది. తల్లిదండ్రులకు ఫొటోసేషన్‌తో పాటు మొక్కల పంపిణీకి సిద్ధం చేశారు. పేరెంట్స్ మీటింగ్ పూర్తి చేసుకున్న తరువాత విందు ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఆడిట్ అధికారి, ప్రత్యేకాధికారి ఈవీవీ సత్యనారాయణ తెలిపారు. గురువారం జరిగే మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆయన వాడపల్లి, లొల్ల జడ్పీ పాఠశాలలను సందర్శించారు. పేరెంట్స్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ టీచర్స్ ఆకారంలో విద్యార్థులు


రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాడు పాఠశాలలో విద్యార్థులు నేడు జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నేపథ్యంలో మెగా పీటీఎం-2 ఆకారంలో స్వాగతం పలుకుతూ ఆకట్టుకున్నారు.

పాఠశాలలు సన్నద్ధం

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో నేడు నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0కు పాఠశాలలను సన్నద్ధం చేశారు. అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. మండలంలోని 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలతో పాటు 14 ప్రైవేటు పాఠశాలలను సిద్ధం చేశారు.

మండలంలో ఏర్పాట్లు పూర్తి

మండపేట, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ డేను నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి2 సోమిరెడ్డి తెలిపారు. మండపేట రూరల్, అర్బన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో కళాశాలలు కలిపి 123 పాఠశాలల్లో దీన్ని నిర్వహిస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు 67, ప్రైవేటు పాఠశాలలో 55లో మెగా పేరెంట్స్‌డే జరుగుతుందన్నారు. 12 ప్రభుత్వ, ప్రైవేటు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కూడా ఇది జరుగుతుందని ఆయన తెలిపారు.



మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణకు హాజరైన పంచాయతీ సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

మండపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల లెవెల్ అధికారులకు బుధవారం మండపేట మండల పరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో 12 పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండపేట మండల డిప్యూటీ ఎంపీడీవో శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎం బాధ్యతల స్వీకరణ



రావులపాలెం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డీఎంగా వైవీవీఎస్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జీజీవీ రమణ తుని డిపోకు బదలీ కావడంతో కొవ్వూరు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యంతో పనిచేయాలి

ఆత్రేయపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధితో గ్రామ పంచాయతీలు 2030నాటికి అభివృద్ధి చెందాలని డీఎల్‌డీవో రాజేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0లో భాగంగా ఎంపీడీవో వెంకటరామన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చిన్నబ్బులు, పరిపాలనాధికారి రామస్వరూప్ తదితరులు పాల్గొన్నారు. ఆత్రేయపురం గ్రామంలో పర్యటించారు. మరో ఇద్దరు పారిశుధ్య కార్మికులను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత వాడపల్లిగా తీర్చిదిద్దాలి

ఆత్రేయపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత వాడపల్లిగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని తహశీల్దారు రాజేశ్వరావు పేర్కొన్నారు. బుధవారం వాడపల్లి వెంకన్న ఆలయంలో ఉపకమిషనరు సూర్యచక్రధరరావు అధ్యక్షతన ప్రజలు, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. వాడపల్లి ఆలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగుల నిరసన

ద్రాక్షారామ, జూలై 9(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులు బుధవారం భోజన విరామంలో ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం జీవో నెం 2ను సవరించి తక్షణమే మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గ్యాట్యుటీ చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు సీహెచ్. వెంకన్నబాబు, సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.